# జీవితం ఓ గల్పిక

"రమాపతి రెండోసారి తప్పాడట. ఎందుకు తప్పాడు మొద్దువెధవ. తప్పకేంచేస్తాడు. ఇదేం కథలు రాయటమనుకున్నాడా?"

ఇవన్నీ లోకులనే మాటలని ఊహించాను. బజారుకెళ్లాలంటేనే భయమేసేది. అందరి మొహాలు కళకళలాడతాయి. ప్రపంచమంతా వింతరంగులతో కనపడుతుంది. నా ఒక్కటే ఏడుపు మొహం. రేడియోల్లోంచి చక్కటి చిక్కటి సంగీతం వినపడుతున్నా, విషాదం గూళ్ళుకట్టుకొని ప్రవహిస్తున్నట్లుగా గుండెల్లో వినపడేది. పరిచయమైన మొహాలుచూసి నవ్వుతున్నట్లుగా బాధ. మూల కూచుని వింతవింత ఊహాలతో గడిపేవాణ్ణి. ఫలితాలకోసం ఎదురుచూసినన్నాళ్ళు పట్టలేదు. మళ్ళీ కంకరరాయి సూటిగా వేగంగా వచ్చి మొహానికి తగిలింది. రక్తంచిమ్మింది. గుండెలవిశాయి. బాధగా మూలిగాను. బరువుగా నిట్టూర్చాను. ఎన్నాళ్ళని గోడలకు మెత్తలకు ఆనుకుని కూచుంటాను? ఇంట్లో గూడా నాతో మాట్లాడేవాళ్ళేరి? పరీక్షలైన మర్నాటినుంచీ, నాకంటే యెక్కువగా అమ్మా, నాన్నా, అన్నయ్యా, వదినె పరీక్ష ఫలితాలకోసం ఎదురుచూశారు. "ఈసారి అవుతావు చూడు, నేను చెప్పానుగా, నాది సత్యవాక్కు" అనేది వదిన. అమ్మ ఎన్నో దేముళ్ళకు మొక్కుకుంది. అనుకున్నన్ని నాళ్ళుపట్టలేదు, ఫలితాలు తెలిశాయి. నంబరు కనబడలేదు. కళ్ళు బైర్లుకమ్మాయి. బయటంతా చీకటి అలుముకుంది.

కాఫీతాగివద్దామంటే భయం. సినిమాకెళదామంటే భయం. స్టేషనుకెళదామంటే భయం. బ్రతుకంతా భయం. జీవితమంతా భయం, భయం.

సాయంత్రం ఏమీ తోచటంలేదు. స్టేషనుకెళ్ళి కాఫీతాగొద్దామని బయలుదేరాను. పరిచయమైన మొహాలు ఎక్కువ కనపడవు. అందుకని స్టేషను కెళ్ళాను. కాఫీతాగి, సిగరెట్ ముట్టించి, ప్లాట్ ఫారంమీద పచారుచేస్తున్నాను. ఇంటర్ క్లాస్ కంపార్టుమెంటులోంచి తల బయటకుపెట్టి చేతితో వూగిస్తూ కళ్ళు వింతగా తిప్పుతూ, "అయితే మళ్ళీ తప్పాడన్నమాట" అంటున్నదో తరళాక్షి క్రింద నిల్చున్న వో యువకుడితో. సౌందర్యాన్ని ఆరాధించమని పెద్దలు చెప్పారు గదా అని, అక్కడే కాసేపు చూస్తూ నిలిచాను. కాని, ఆ అమ్మాయి, అలాంటి ప్రశ్న వేస్తుందని తెలిస్తే, అక్కడా చచ్చినా నిలుచుండేవాణ్ణి గాను. గుండెలో ఎవరో బల్లేలుదించినట్లయింది. కసిదీరా మనసులో ఆ అమ్మాయిని తిట్టుకున్నాను.

"పాపం పూర్ ఫెలో, అదృష్టహీనుడు, అంతకంటే ఏంలేదు, ఎంత మంచివాడు, ఎంత చక్కటి కథలు వ్రాస్తాడు" అంటున్నదామ్మాయి. 'పాపం, ఎంత మంచిది. ఎంతటి ఉత్తమురాలు, చాలా మంచిది, నేనే వెధవను, ఇదంతా నన్నుగురించి కాదు గదా, ఏమో మరి!' అనుకుంటున్నాను. రెడ్డివచ్చి బుజంమీద చేయేశాడు. "మళ్ళీ పోయిందా?" అన్నాడు. ఆ అమ్మాయి వింతగా నా వైపు చూసింది. రెడ్డిని నమిలి మింగుదామన్నంత కోపమొచ్చింది. వెధవ రాస్కెల్ అయినాడులే. ఎలా అయితేనేం. "అయ్యో పాపం, యీసారైనా.." అంటున్నాడు. నాకు మండింది. "పోతేపోయిందిలే! నీ సానుభూతి నాకేం అవసరంలేదు, నీ దగ్గరే వుంచుకో" అన్నాను కోపంగా. "మరి అమావాస్యలా ముఖమెందుకు పెట్టావు?" అన్నాడు రెడ్డి. "నా బ్రతుకు అమావాస్యగాక ఇంకేముంది- ఇక వెన్నెలలేదు" అన్నాను బాధగా. ఆ అమ్మాయి నా వైపు జాలిగాచూసింది. మంచిది పాపం. ఎంతో మంచిది.

"ఇంకామాటల్లో కవిత్వం పోలేదు. కవిత్వం అంతగా వొలకబోయబట్టే, ఇంత పరిస్థితికొచ్చావు. కథలుగూడా వ్రాస్తున్నావా ఇంకా? ఇక మానెయ్, లేకపోతే బాగుపడవు."

"కృతజ్ఞుణ్ణి, నీ సలహాలేం అవసరంలేదు, వెళ్ళిపో" అన్నాను కసిగా.

ఆ అమ్మాయి నా వైపు పుట్టెడు ఆశ్చర్యంతో చూసింది. కళ్లు పెద్దవిచేసి నావైపు చూస్తున్నది. నేను తట్టుకోలేకపోయాను.

"రెండోసారి పోయినా నిక్కవదల్లేదు." రెడ్డి అంటున్నాడు, నాకు వినపడకపోలేదు. వినపడింది. రమాపతి జీవితంతో పోట్లాడాడు, వోడిపోయాడు. ఒకసారికాదు. రెండుసార్లు. —"రమాపతి"